క్లుప్తంగా

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం



సంగెం: మండల కేంద్రానికి చెందిన నల్ల మేఘన ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మెడికల్ కౌన్సెలింగ్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. 6 వ తరగతి నుంచి గవిచర్ల మోడల్ స్కూల్‌లో, ఇంటర్ మీడియట్ ఖిలావరంగల్ మహాత్మాజ్యోతిరావు పూలే కళాశాలలో విద్యనభ్యసించింది. సోమవారం కాలనీవాసులు మేఘనను ఘనంగా సన్మానించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు గుండేటి కుమారస్వామి, మాజీ ఎంపీటీసీ పులి వీరస్వామి, మాజీ ఉపసర్పంచ్ కక్కెర్ల శరత్, పులి రమేష్, ఎనబోతుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల బహూకరణ



పర్వతగిరి: పర్వతగిరి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్‌కు వరంగల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 30 కుర్చీలను బహూకరించారు. వరంగల్ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన గవర్నర్ విజిట్ కార్యక్రమం సందర్భంగా కుర్చీలు అందజేసినట్లు హాస్టల్ ఇన్‌చార్జ్, కస్తూర్బా గాంధీ స్పెషల్ ఆఫీసర్ నాజియా సల్మా తెలిపారు. అలాగే కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ లైబ్రరీకి పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ 3150 గవర్నర్ ఎస్‌వీ.రాంప్రసాద్, ప్రెసిడెంట్ కొల్లూరి శివప్రసాద్, సెక్రటరీ గాదె ఎల్లరాజు, ట్రెజరర్ గంట వేణుగోపాల్, డీ.నర్సింహారావు, ఎమ్మార్సీ సీసీఓ జయరాజ్, కేజీబీవీ సీఆర్టీ పద్మ, మోడల్ స్కూల్ గర్ల్స్ హాస్టల్ వార్డెన్ గౌతమి, కేజీబీవీ ఇంటరాక్ట్ క్లబ్ స్టూడెంట్స్, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

పర్వతగిరి: మండలంలోని ఏనుగల్ గ్రామానికి చెందిన వాకిటి రాజు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు తొర్రి పద్మకుమార్‌యాదవ్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. దశదిన కర్మలో పాల్గొని 50 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు తొర్రి కుమారస్వామి, బూత్ కన్వీనర్ ధోని సంపత్, కాంగ్రెస్ నాయకులు వాకిటి రవి, నాగరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలి

రాయపర్తి: మండలకేంద్రంలోని కొత్తరాయపర్తిలోని పురాతన గడిలో మట్టిని తవ్వడం నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామ పరిరక్షణ కమిటీ సభ్యులు రావుల భాస్కర్‌రావు, ముద్రబోయిన సుధాకర్ కోరారు. సోమవారం మండలకేంద్రంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడిలో ప్రైవేట్ వ్యక్తులు ఇప్పటికే సుమారు 400 ట్రిప్పుల మట్టిని అమ్ముకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు?

నర్సంపేట రూరల్: నర్సంపేట మండలంలోని రాజేశ్వర్‌రావుపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. గుప్తనిధుల తవ్వకాల స్థలంలో జంతు బలి, పసుపు, కుంకుమ, నిమ్మకాలు వేసి పూజలు చేయడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. సోమవారం ఉదయం పలువురు అక్కడికి వెళ్లి చూడగా వర్షానికి కొట్టుకుపోయింది. ఈ విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

మొరం తవ్వుతున్న జేసీబీ సీజ్



సంగెం: మండలంలోని నార్లవాయిలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న జేసీబీని సీజ్ చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. సోమవారం ఉదయం పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో అక్రమంగా మొరం తవ్వకాలు జరుపుతున్న జేసీబీ కన్పించడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆస్తి, భూమి, మట్టి, మొరం ధ్వంసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అయ్యో.. అన్నదాత

ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు వాననీటిలో కొట్టుకుపోతుంటే అన్నదాతలు కన్నీరుమున్నీరుగా విలపించారు. సోమవారం తెల్లవారుజాము నుంచి జిల్లా వ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో కొన్నిచోట్ల చేనులోనే పంట దెబ్బతినగా.. కొన్ని చోట్ల ఆరబోసిన పంట నీటిపాలైంది. ప్రధానంగా మొక్కజొన్న రైతులకు ఈ వాన తీవ్ర నష్టం కలిగించింది. పంట కోసి ఆరబోయగా.. వరదనీటిలో మక్కలు కొట్టుకుపోయాయి. వరి పంట నేలవాలింది. మిరప నీట మునిగింది. పత్తి పనికిరాకుండాపోయింది.

అన్నదాత ఆగమాగం



ఖానాపురం: మండల వ్యాప్తంగా కురిసిన వర్షంతో అన్నదాతలు ఆగమాగమయ్యారు. రోడ్లపై, సబ్‌మార్కెట్ యార్డులో ఆరబెట్టుకున్న మక్కజొన్నలను తడవకుండా జాగ్రత్తలు పడ్డారు. మొక్కజొన్నలు తడవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షానికి నాజీతండాకు వెళ్లే కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహించడంతో ప్రయాణాలు నిలిచిపోయాయి. పోలీసులు భారీకేడ్‌లు ఏర్పాటు చేసి భద్రతా చర్యలు చేపట్టారు. పాకాల వాగు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది.

దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి



నర్సంపేట రూరల్ : పంటలు చేతికొచ్చే సమయంలోనే అకాల వర్షంతీవ్ర నష్టాన్ని మిగిల్చింది. నర్సంపేట, చెన్నారావుపేట మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కజొన్న పంటలు చేతికొచ్చి కల్లాలవద్దనే ఆరబోశారు. సోమవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి మక్కలు మొత్తం తడిసి ముద్దయ్యాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి మద్దతు ధర రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా రైతుల పరిస్థితి మారింది. వర్షానికి మక్కలు తడిసిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పత్తి జాలుపట్టిపోయింది.

నిలిచిన రాకపోకలు



నెక్కొండ: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం వాన భీభత్సం సృష్టించింది. దీంతో నెక్కొండ, వెంకటాపురం చెరువులు మత్తడి పోయగా నెక్కొండ వట్టి వాగు ఉధృతంగా ప్రవహించింది. వెంకటాపురం చెరువు మత్తడి పోయడంతో కేసముద్రం–నెక్కొండ ప్రధాన రహదారి (లో లెవల్ బ్రిడ్జి)లో నీటి ప్రవాహం ఎక్కువైంది. దీంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు ఇనుగుర్తి నుంచి నెక్కొండ చేరుకున్నాయి. కాగా గత వర్షకాలంలోనూ ఇదే లోలెవల్ బ్రిడ్జిలో నీటి ప్రవాహంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారుల నిర్లక్ష్యంగా కారణంగా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంఘటనస్థలికి తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎస్సై మహేందర్ చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

మక్క రైతుల ఇక్కట్లు



నర్సంపేట: కంటికి రెప్పలా కాపాడుకున్న మక్క పంట అమ్ముకునే దశలో కురుస్తున్న వర్షాలు రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షాలతో నర్సంపేట మార్కెట్లో అమ్ముకోవడానికి సిద్ధంగా ఉన్న మక్కలు తడిసి వరదకు కొట్టుకుపోయాయి. దీంతో కాపాడుకునేందుకు రైతులు తీవ్రంగా శ్రమించారు.

జోరువాన



నల్లబెల్లి: మండలంలో ఆదివారం కురిసిన వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నల్లబెల్లి క్రాస్ హైవే రోడ్డు ఆరబోసిన మక్కలను పరదాలు కప్పి కాపాడుకున్నారు. నందిగామలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు.

బీఆర్ఎస్ మోసపూరిత మాటలు నమ్మొద్దు



మంజూరు పత్రాలను అందజేస్తున్న నాయకులు

ఖానాపురం: బీఆర్ఎస్ పార్టీ నాయకుల మోసపూరిత మాటలను నమ్మొద్దని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యద్ల జగన్మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా ఎనిమిది గ్రామాల్లోని ఎస్సీ, ఎస్టీలకు 122 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. ఇందిరమ్మ పథకం ద్వారా 347 మంజూరు కాగా 320 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమై బిల్లులు కూడా మంజూరయ్యాయని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిరుపేదలకు అండగా నిలవాలనే ఉద్దేశంతోనే ఇందిరమ్మ పథకానికి శ్రీకారం చుట్టారని అన్నారు. అబద్దపు మాటలతో గ్రామాల్లోకి బ్రోకర్లు వస్తున్నారని, తప్పుడు ప్రచారం చేస్తూ ఓట్ల కోసం వస్తున్నారని వారి మాటలు తమ్మొదని సూచించారు. ఎన్నికల ముందు తప్పుడు మాటలతో వచ్చే వారికి బుద్ధిచెప్పాలన్నారు. సమావేశంలో నాయకులు వెంకటప్రసాదరావు, ముస్తఫా, సాగర్‌రావు, లాల్‌సాహెబ్, పూల్‌సింగ్, నవీన్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలి

- ఏపీఎం ఈశ్వరయ్య
- నగదు రహిత లావాదేవీలపై శిక్షణ



మాట్లాడుతున్న ఏపీఎం ఈశ్వరయ్య

గీసుకొండ: పొదుపు సంఘాల మహిళలు బ్యాంకులకు సంబంధించిన నగదు రహిత లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలని సెర్ప్–డీఆర్‌డీఏ ఏపీఎం ఈశ్వరయ్య అన్నారు. సోమవారం కొనాయమాకుల వద్ద గల ప్రగతి మండల సమాఖ్యలో నగదు రహిత లావాదేవీలపై పొదుపు సంఘాల మహిళలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అపరిచితమైన మెస్సెజీలు, యాప్‌ల జోలికి వెళ్లొద్దన్నారు. బ్యాంక్ ఖాతాకు ఫోన్, ఆధార్ కార్డు నంబర్లు లింక్, కేవైసీ చేసుకోవాలని, ఖాతాదారులకు వర్తించే ఇన్సూరెన్స్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. మాయమాటలు, మెస్సేజీల ద్వారా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోవద్దన్నారు. మండల సమాఖ్య కార్యదర్శి దౌడు శారద అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీసీ బొజ్జ సురేశ్, వీఓ అధ్యక్షుడు దౌడు మమత, చాపర్తి సునిత, సీఆర్పీలు పాగాకు సునిత, మేకల నాగమల్లేశ్వరి, వీఓఏలు వీరగోని జ్యోతి, కర్ణకంటి సరస్వతి, వీరగోని హేమలత, భవాని, మహిళా ప్రతినిధులు ఉమారాణి, సుభద్ర, నవత తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన మండల యూత్ అధ్యక్షుడు గొడుగు వినయ్ నానమ్మ లచ్చమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సోమవారం లచ్చమ్మ భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కల్లెడ గ్రామానికి చెందిన మద్దెల శ్రీనివాస్, బాల్లె వెంకటయ్యలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. కల్లెడలో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షంతో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపైకి చేరి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాగరాజు సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామంలో శాశ్వత డ్రెయినేజీ నిర్మించాలని ఆదేశించారు.

మాజీ ఎంపీటీసీ కుటుంబానికి చేయూత



రక్తదానం చేసిన యువకులు

దుగ్గొండి: మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ జిల్లెల సాయికుమార్ 10 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించి రూ.50 వేల సాయం అందించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకులు, వంగేటి అశోక్ కుమార్, పెండ్యాల రాజు రూ.35 వేలు, శంభయ్యపల్లి గ్రామస్తులు రూ.31,600 అందించారు. దుగ్గొండి ఎంపీటీసీగా పనిచేసిన సాయికుమార్ సేవలకు కృతజ్ఞతగా గ్రామ యువకులు 30 మంది దశదిన కర్మను పురస్కరించుకుని సోమవారం రక్తదానం చేశారు. సాయికుమార్ ఆశయాల స్ఫూర్తిగా ముందుకు సాగుతామని ప్రతినబూనారు. కార్యక్రమంలో మాజీ మావోయిస్టు నాయకులు భారతక్క, సిద్ధిరాజు, మురళి, సాయికుమార్ భార్య రమ, కుమారుడు ఉమేష్, కూతురు సాయిప్రసన్న, వివిధ పార్టీల నాయకులు, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ డీ విద్యార్థుల క్లినికల్ సెషన్ ప్రారంభం



సెషన్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌దాస్

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని జయముఖి ఇంజనీరింగ్ ఫార్మా డీ విద్యార్థులకు క్లినికల్ సెషన్ నర్సంపేట మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, సూపరింటెండెంట్ కిషన్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫార్మసీ డీ కోర్సులో క్లినికల్ ట్రైనింగ్ ఎంతో కీలకమైన దశ అని, విద్యార్థులు వైద్యులతో కలిసి ఆస్పత్రిలో రోగులకు సేవ చేయడం ద్వారా ప్రాక్టికల్ అనుభవాన్ని పొందుతారన్నారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ టీవీ ఆర్ఎస్‌రెడ్డి, జయముఖి ఫార్మసీ ప్రిన్సిపాల్ వాసుదేవమూర్తి, డాక్టర్ అనిల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్

- కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వెంకయ్య



ఓవరాల్ చాంపియన్ షిప్ జట్టుతో వెంకయ్య

మామునూరు : యువకులు చదువుతో పాటు క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య, రిటైర్డ్ కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్, స్పోర్ట్స్ డైరెక్టర్ ఎర్రగట్టు స్వామి అన్నారు. ఖిలావరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి క్రీడా మైదానంలో కేయూ ఆధ్వర్యంలో వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్ రెడ్డి సహకారంతో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజీ టోర్నమెంట్స్ సోమవారం సాయంత్రం ముగిశాయి. వాగ్దేవి కాలేజ్ డైరెక్టర్ సీహెచ్.వాణిదేవి, సీహెచ్.సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు వేడుకలకు వారు ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. యువత అంతర్జాతీయ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని క్రీడలపై మక్కువ పెంచుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. క్రీడలు దేహదారుఢ్యానికి, ఆరోగ్యం, మానసికోల్లాసానికి దోహదపడుతాయన్నారు. క్రీడల ద్వారా క్రీడాకారుల మధ్య సోదరభావం, ఐకమత్యం పెంపొందుతుందని తెలిపారు. అనంతరం సింగరేణి క్యాలరీస్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల కొత్తగూడం జట్టు చాంపియన్ షిప్ ట్రోఫీ అందుకుంది. పలు క్రీడల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు.

క్రాప్ బుకింగ్‌తోనే కొనుగోళ్లు

- ఆయకట్టులో 16,000 ఎకరాల వరిసాగు
- ఇప్పటికీ 9,000 ఎకరాలే నమోదు
- అక్టోబర్ 25వ తేదీ వరకు గడువు



క్రాప్ బుకింగ్ నమోదు కోసం వివరాలు సేకరిస్తున్న ఏఈఓ ఆశాదీప్ (ఫైల్)

ఖానాపురం: రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించుకోవాలంటే క్రాప్ బుకింగ్ తప్పనిసరి.. ఈప్రక్రియను వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుల వద్దకే వచ్చి పూర్తి చేస్తున్నారు. నమోదు చేసుకోకుంటే విక్రయ సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఖానాపురం మండలంలో ప్రధాన నీటి వనరు పాకాల.. పాకాల ఆయకట్టు కింద 29,500 ఎకరాల్లో రైతులు వరి పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో ఖానాపురం మండల పరిధిలో 16,000 ఎకరాల్లో సాగు అవుతుంది. సాగు చేసిన రైతుల కోసం ప్రభుత్వం సహకార సంఘాలతోపాటు రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. వరి పంటలను సాగు చేసుకున్న రైతులు కొనుగోలు కేంద్రాల పరిధిలో ధాన్యం విక్రయించాల్సి ఉంటుంది. ఇందుకోసం వ్యవసాయ శాఖ అధికారులు క్రాప్ బుకింగ్ చేస్తున్నారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలు సివిల్ సప్లయీస్, సహకార అధికారుల వద్దకు వెళ్తాయి. వీటి ఆధారంగా కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగనుంది. ఒకవేళ క్రాప్ బుకింగ్ చేయించుకోకపోతే రైతులు ధాన్యం విక్రయాలు చేసుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. పట్టాలు కలిగిన రెవెన్యూ, పోడు, ఇతర రకాల భూముల్లో రైతులు ఏ పంటలు సాగు చేసినా నమోదు తప్పనిసరిగా చేసుకోవాల్సి ఉంటుంది. వరి సాగు చేసిన రైతులు ఇప్పటి వరకు 9వేల ఎకరాల వివరాలను క్రాప్ బుకింగ్‌లో నమోదు చేయగా మరో 7 వేల ఎకరాల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. నమోదు చేసుకోని రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. అక్టోబర్ 25వ తేదీ వరకు క్రాప్ బుకింగ్ నమోదుకు అవకాశం ఉంది.

నమోదు తప్పనిసరి



రైతులు పంటల సాగు వివరాలను తప్పకుండా నమోదు చేయించుకోవాలి. లేదంటే విక్రయాల సమయంలో ఇబ్బంది ఉంటుంది. క్రాప్ బుకింగ్‌లో నమోదు కాకుండా ఉంటే ధాన్యం విక్రయించుకోలేరు. వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదుకు వచ్చిన సమయంలో సహకరించి నమోదు చేసుకోవాలి.

– భోగ శ్రీనివాస్, వ్యవసాయ అధికారి

వాలీబాల్ టీం కోచ్‌గా కాట్రపల్లి పీడీ



సమ్మయ్య

రాయపర్తి: ఉమ్మడి వరంగల్ జిల్లా వాలీబాల్ కోచ్‌గా మండలంలోని కాట్రపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ పుట్ట సమ్మయ్య ఎంపికయ్యారు. ఈమేరకు సోమవారం డీఈఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 16న హైదరాబాద్‌లోని పటాన్‌చెరులో జరిగే 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి, ఈనెల 17న ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగే పోటీల్లో కోచ్‌గా వ్యవహరించనున్నట్లు సమ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఝాన్సీలక్ష్మి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు.. సమ్మయ్యను అభినందించారు.

ఐకమత్యంతో ముందుకు సాగాలి

- కాన ప్రవీణ్‌కుమార్

ఖానాపురం: యాదవులంతా ఐకమత్యంతో ఉంటూ ముందుకు సాగాలని మాజీ సర్పంచ్, యాదవ సంఘం బాధ్యులు కాస ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మంగళవారిపేటలో యాదవ సంఘం సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేతాటిపై ఉంటూ అన్ని రంగాల్లో రాణించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ గ్రామాన యాదవ సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆబోతు అశోక్, రాములు, రాజు, ఉపేందర్, రవికుమార్, నవీన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం

- డీఎంహెచ్‌ఓ సాంబశివరావు
- సాక్షి కథనానికి స్పందన

సాక్షి స్పందన

నల్లబెల్లి: నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సాంబశివరావు తెలిపారు. 'పీహెచ్‌సీలో వైద్యం నామమాత్రమే' శీర్షికతో ఈ నెల 11న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. నల్లబెల్లి ఆరోగ్య కేంద్రంలో గతంలో 24 గంటల వైద్యసేవలు అందించేవారు. ఇదే మండలంలో మేడపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ట్రైబల్ పీహెచ్‌సీ అయినందున 24 గంటల సేవల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడం జరిగింది. దీనిని 12 గంటల ఆస్పత్రిగా మార్చుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడం జరిగింది. ఆదేశాలకు అనుగుణంగా నల్లబెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఓపీ సేవలు, రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల విజ్ఞప్తి మేరకు 24 గంటల సేవలందించేందుకు కృషి చేస్తామన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ ఖోఖో పోటీలకు కొండూరు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాయపర్తి: ఎస్‌జీఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని కొండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం పద్మలత తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 8, 9న వరంగల్ జిల్లాలోని ఓ సిటీలో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబర్చి ఉమ్మడి వరంగల్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ నాగరాజుతోపాటు విద్యార్థులను అభినందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గేదెల మృతి



నెక్కొండ: ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతోపాటు పిడుగు పడి రెండు గేదెలు మృత్యువాత పడిన సంఘటన మండలంలోని చంద్రుగొండలో సోమవారం జరిగింది. బాధిత రైతులు దాసరి సంపత్ తెలిపిన వివరాల ప్రకారం.. పశువుల షెడ్‌లో ఉన్న రెండు గేదెలు ఆదివారం రాత్రి పిడుగు పడడంతో మృతి చెందాయి. సుమారు రూ.1.20 లక్షల మేర నష్టం వాటిల్లిందని సంపత్ వాపోయాడు. ప్రభుత్వం పరిహారం అందించాలని ఆయన కోరారు.